# 5 రెక్కలు విప్పిన ఒక్కల

చిరాగ్గా అటూ ఇటూ కుర్చీలో కదిలాడు సూర్యారావు. కాలుస్తున్న సిగరెట్‌ను డ్రాయరు కోడుకేసి వత్తి, కింద పడేశాడు. ఒక్కసారి వేళ్ళు మెటికలు విరుచుకొని డ్రాయరు మీదికి వంగాడు. అప్పటికే తోటి గుమస్తాలు పనిలోకి వారి గారు. తను రావడమే రవంత ఆలస్యంగా వచ్చాడు. అదీగాక ఈపూట బోలెడంత పని కూడా ఉంది ...

సూర్యారావు చిరాకుపడ్డాడు. గదినిండా చిందరవందరగా సంచులు పడి ఉన్నాయి. ఈ సంచుల్లో చిరునామాదారులకు అందని ఉత్తరాలు వందలకొద్దీ ఉంటాయి. వాటిని చూసే అవకాశమున్నట్లయితే ఆయా చిరునామాదారులకు వాటిని పంపాలి, లేదా వ్రాసిన వారికయినా పంపాలి. కర్మ కాలి కొన్ని ఉత్తరాలు ఎవరు రాసిందీ తెలీదు. ఎవరికి చేరవలసిందీ తెలీదు ... డెడ్ లెటర్ ఆఫీసువారు అటువంటివాటిని....

సూర్యారావు అటువంటి ఉత్తరాలను వేలకొద్దీ చదివాడు. ఎన్నో గాథలు ఆ ఉత్తరాల్లో దాక్కొని ఉంటాయి. ఎన్నో వ్యాపార రహస్యాలు వెల్లడవుతూ ఉంటాయి.

సూర్యారావు ఒక్క మూలుగు మూలిగి రాశిగా

ముందు పడున్న లేఖలను పరిశీలించ సాగడు. పెన్సిల్‌తో రాసిన కార్డు చేతి కొచ్చింది. "చిరంజీవులైన నాన్నగారికి యివ్వవలెను" అని దానిమీద అడ్రసు రాసి ఉంది.

సూర్యారావు ఉత్తరం చదవ సాగాడు.

"సిరంజీవులైన నాన్నకు దీవించి క్రుష్న మూర్తి వ్రాయుట యేమనగా ఇంకడ అందమూ కుశాసా. పెద్ద లయిన అకయ్యగారున్నూ, బావగారున్నూ, నన్ను బొవు స్రేద్ధగా చూశ్తుంటిరి. నేను నాలుగో తరగతిలో పడితిని. భావగారు మెచ్చుకొనెను. అకయ్య నాకు రోజూ పైసాలు ఇచ్చెను. ఈ జాబు అందగానే కారదు నాకు రాయవలెను. అంమకు దన్నములు. నాన్నకు దీవెనలు. తమ్ముడు గోపికి ముదులు. ఇంతే సంగతులు. ఇట్లు తమ కొమార్డు.

రాదాక్రుష్న మూర్తి వరాలు"

సూర్యారావు ఆ ఉత్తరంకేసి చూచి నిట్టూర్పు విడిచాడు. ఇప్పటికి రమారమిగా రెండు మాసాల క్రిందట ఈ ఉత్తరం విజయవాడలో పోష్టు అయింది. ఈ నాటికి డెడ్ లెటర్ ఆఫీసుకు చేరింది. తను రాసిన ఉత్తరం తండ్రికి చేరే ఉంటుందని ఆ కుర్రవాడు అనుకొంటాడు ఆ ఉత్తరాన్ని చూసి తండ్రి ఎంతో ముచ్చటపడతాడని కూడా వాడు అనుకోవచ్చు. తండ్రి నుండి జవాబుకోసం ఎదురుచూసి చూసి, అతగాడెంతయినా విసిగి ఉండవచ్చు. ఉత్తరం వచ్చినా, అక్కా బావలు తనను మభ్యపెడుతున్నారని వాడనుకొన్నా

అనుకోవచ్చు. ఏది ఏమైనప్పటికీ, రాధాకృష్ణమూర్తి శివ తరగతి ప్యాసయిన శుభవార్త సకాలంలో తండ్రికి అందలేదు. అందితే ఆ తండ్రి ఎంత ఆనందించేవాడో మరి!

ఆ కార్డును ప్రక్కకు పెట్టేసి మరో జాబును అందుకొన్నాడు సూర్యారావు. 'శ్రీ కె. కె. రావుగారు - హైదరాబాద్' అని అడ్రసు రాసి ఉంది.

పోస్టు ముద్రలనుబట్టి ఇప్పటికి ఖచ్చితంగా నలభై ఏనిమిది రోజుల క్రిందట చాందాలో ఈ ఉత్తరం పోస్టు చేయబడింది. ఆ ఇన్‌లాండ్ లెటర్ రెండువైపులా చిత్తవత్తుగా పోస్టు ముద్రలున్నాయి. లక్షలాది జనసంఖ్యగల హైదరాబాద్ నగరంలో కనీసం వందలసంఖ్యలోనన్నా కె. కె. రావులు ఉండవచ్చు. ఇందులో ఎవరికి ఉత్తరం యిచ్చేటట్టు? కనీసం 'ఫ్రం' అడ్రసన్నా లేదు, తిప్పి పంపడానికి. సూర్యారావు దాన్ని చింపి చూశాడు.

"నాన్నగారికి!

"మనఃపూర్వక నమస్కారాలు! ఇప్పటికే మీకు రెండు జాబులు రాశాను. ఇది మూడవది. మీనుండి సకాలంలో జాబు వస్తుందని ఆశించాను. మీరింత కాఠిన్యం వహిస్తారనుకోలేదు. నన్నింకా క్షమించలేధా నాన్నా! కన్నవారు మీరే మీ బిడ్డల తప్పుల్ని మన్నించకపోతే, లోకం ఎలా మన్నిస్తుంది? నేను చాలా తప్పుచేశాను. అప్పట్లో మంచి చెడ్డలనుగురించి ఆలోచించలేక పోయాను. వారు చెప్పిన మాటలు నన్ను

మైకంలో నింపేశాయి. మీకు అవమానం తెప్పించాను, పది మందీ కాకుల్లా మిమ్మల్ని పొడుస్తుంటే, సూటీపోటీ లంటుంటే మీ హృదయం ఎంత సంక్షుభిత పడి ఉంటుందో నేను ఊహించ గలను. నాలాంటి పాపిష్టి దానివల్ల మన వంశ గౌరవానికి తీరని మచ్చ ఏర్పడింది.... నన్ను క్షమించవా నాన్నా !

"దుస్సహమైన బాధల్లో ఉండి మీకు జాబు రాస్తున్నాను. నా ఆరోగ్యం ఏమీ బాగోలేదు. ఎనిమిదవ నెల, డాక్టరు విశ్రాంతి తీసుకోమనీ, మంచి మందులు వాడమనీ చెప్పాడు. అయినా ఒక పూట తిండి దొరికితే, మళ్ళా ఎప్పుడు తింటామో తెలియకుండా ఉంది. నాలుగు రోజులనుండీ ఉత్తరం రాద్దా మనుకొంటుంటే - ఇవాళ పదిపైసలు దొరికాయి. నా వొంటిమీది నగలు; ఆయనగారు తెచ్చిన డబ్బు, మొత్తం చెల్లిపోయాయి. పొట్ట చేతబట్టుకొని ఒకచోటినుండి మరో చోటికి తిరుగుతున్నాం. అనేకసార్లు చచ్చిపోదామని గూడా అనుకొన్నాను. కానీ, అమ్మా, నువ్వూ జ్ఞాపకం వచ్చేవారు. చిట్టి తమ్ముడూ, చెల్లాయీ కళ్ళలో మెదిలేవారు. చావలేక పోయేదాన్ని. నాకు బ్రతుకుమీద ఆశ లేదు. కానీ ఒక చిన్న కోరిక ! ఒక్కసారి అమ్మా నువ్వూ, నాకు కనిపించండి! మిమ్మల్ని చూశాక నిశ్చింతగా చచ్చిపోతాను. ఎంత హీనపు పనిచేసినా, నీ రక్తం పంచుకొని పుట్టాను. నా తప్పుని...ఒక్కసారి - ఒక్క సారి చాలు నాన్నా - ఒక్కసారి కనబడు. చాలు ! నే నింకేమీ కోరను... మీ జవాబుకోసం లక్ష కళ్ళతో

ఎదురు చూస్తుంటాను... తప్పకుండా కనిపించు నాన్నా!
నాన్నా! నాన్నా! నాన్నా! నాన్నా!!"

సూర్యారావు జేబుగుడ్డతో ముఖం తుడుచుకొన్నాడు. అతని గుండెలు ఎందుకో బరువెక్కినట్లనిపించాయి. ఆ ఉత్తరాన్ని మళ్ళా మళ్ళా చదువుకొన్నాడు. విషాద పూరితమైన గాథ ఏదో ఆ ఉత్తరం వెనక దాగిఉన్నట్లనిపించింది.

ఇదీ అంతే! ఆ కూతురు, మిగతా ఉత్తరంనిండా 'నాన్నా! నాన్నా!' అంటూ రాసింది. నాన్నకోసం ఆ హృదయం ఎంత కలవరించించి ఉంటుందో, ఆ భగవంతునికే తెలియాలి. తను రాసిన జాబు తండ్రికి చేరే ఉంటుందనీ, కోపంతోనే తండ్రి జవాబు రాయలేదనీ ఆమె అనుకొంటే ఇంకెంత కుంగిపోతుందో! అగ్నిజ్వాలలమధ్య జీవిస్తూ, చల్లని చూపుకోసం ఎదురుచూసే వ్యక్తికి - అదీ లభించనప్పుడు, కనీసం లభిస్తుందనే ఆశకూడా లేనప్పుడు, కలిగే క్షోభ అనుభవం మీదగానీ తెలీదు. విష ఝుంఝునుండి బయటపడటానికి ప్రాణి చేసే నిష్ఫల పోరాటం సూర్యారావుకు జ్ఞప్తికొచ్చింది....

ఒక్క నిట్టూర్పు విడిచి, ఆ ఉత్తరాన్ని పక్కకు పెట్టేశాడు సూర్యారావు. మరోదాన్ని అందుకొన్నాడు.

'ప్రియమైన అక్కయ్య శకుంతల కిచ్చేది' అని రాసి ఉంది. ఏవూరో లేదు. మౌనంగా నవ్వుకొన్నాడు సూర్యారావు. కవరుమీద ముద్ర చూశాడు. ఈ ఊళ్ళోనే పోష్టు చేశారు. ఎవరు రాసిందీ మాత్రం తెలీదు.... ఓ క్షణం కళ్ళు

మూసుకొని ఉత్తరాన్ని చించాడు సూర్యారావు.

"అక్కకు, రమణ నమస్కారములు! నీవు రాసిన ఉత్తరం అందినది. అందలి సంగతులు తెలిసినవి. ఆ ఉత్తరం, అమ్మ శేషుపిన్ని దొడ్లోకి వెళ్ళి రహస్యంగా చదువుకొన్నారు. నేను ఎంత అడిగినా అందులో సంగతులు చెప్పలేదు. కానీ, అమ్మగారు, శేషుపిన్నిగారు, ఆ దినమంతయు నేడ్చుచునే యుండిరి. ఉత్తరము వచ్చినట్లుగా నాన్నతో చెప్పవద్దనినారు. శేషుపిన్ని నాకు కొత్తపరికిణి కుట్టించుతానన్నది. నేను కూడా నాన్నకు చెప్పలేదు. అక్కా! నువ్వు నాతో చెప్పకుండా ఎక్కడకి వెళ్ళననికూడా వెళ్ళితివి. నీ కోసము చాలా దిగులుగా ఉన్నది. నువ్వు వేసిన బంతిచెట్లు చక్కగా పూలు పూయుచున్నవి. తమ్ముడు, పెద్ద అక్కగారింట్లో ఉండి చదువుతున్నాడు. వాడు ఈ మధ్యనే నాల్గవ తరగతిలో పడినట్లు బావగారు జాబు వ్రాసిరి. పెద్ద అక్కనుండి ఈ మధ్యనే ఉత్తరము వచ్చినది. నీ పుస్తకములు కట్టగట్టి, మసెలమీద దాచినారు. వాటిని 'చూచినప్పుడల్లా అమ్మ ఏడ్చుచున్నది. నీ రిబ్బను, జడపిన్నులు అమ్మ పెట్టెలో దాచినది. నీ పేరు వచ్చినరోజున అమ్మ ఏడుస్తూ అన్నం తినుట లేదు. మొన్నటి రోజున సంగీతం మేష్టరుగారు కనిపించిరి. అమ్మ తలుపు చాటుకు వెళ్ళినది. ఆయన నవ్వుతూ వెళ్లెను. అమ్మ.... మావయ్య ఇంటికని వంక బెట్టి, శేషుపిన్నితో కలిసి నీ దగ్గరకు రావలెనని అనుచున్నది. అక్కా! నువ్వు వెంటనే

రావలెను. నీవు చెప్పినపాట నాకు కంఠత వచ్చినది. ఇప్పుడు తప్పులు పోవుటలేదు - క్రొత్తపాట నేర్పుటకు ఇదే ఉలిగ్రాంగా అనుకొని రావలెను. ఇంతే చిరాయువులు....

సరళ వ్రాలు'

సూర్యారావు మరోసారి నిట్టూర్పు విడిచాడు. ఆ రోజున అతనికి తను చేస్తున్న ఉద్యోగం మీద విరక్తి కలిగింది. జీవితంలో యాదాలాపంగా చేసే ఓ చిన్న పొరబాటువల్ల ఎంతటి ఘోరపరిణామాలు రావడానికయినా అవకాశా లున్నా యనిపించింది! ఓ జీవితం ధ్వంసం కావడానికి, చిన్న పొరబాటు చాలు ననిపించింది! ఎక్కడో ఉన్న అక్కకు అంద వలసిన చెల్లెలి అనురాగ హృదయం, ఇప్పుడు తన బల్లమీద దిక్కుతోచక పడి ఉంది! విసుగ్గా ఆవలించాడు సూర్యారావు. మరో ఉత్తరాన్ని అందుకొన్నాడు.

దానిమీద 'హైదరాబాద్' అని ఉంది. ఎవరి కివ్వాలో లేదు. చింపి చూశాడు సూర్యారావు.

".....మిమ్మల్ని ఏమని పిలవాలో తెలక అలా ఖాళీగా విడిచి పెట్టాను. ఈ ఉత్తరాన్ని పూర్తిగా చదివాక చింపి వేసినా నా కభ్యంతరం లేదు.....చెప్పదలిచింది దేమిటంటే, మీ వల్లనే మా బ్రతుకులు ఇంత ఘోరంగా తయారయ్యాయి అని! మీరు వొప్పుకోక పోవచ్చు. కాని నిజమంతే! శకుంత లకూ, నాకూ పెళ్లి చెయ్యటానికి మీరు వొప్పుకొన్నట్లయితే, మే మిద్దరమూ ఎంతయినా సుఖపడే వాళ్ళం. దిక్కుమాలిన;

నిష్ప్రయోజనమైన కుళంకలతో మీరాపని చెయ్యలేదు. చివరి రోజుల్లో శకుంతల నన్ను కలుసుకోకుండా కట్టుదిట్టాలు చేశారు. ఆమెను హింసించారు. ఆ విధంగా శకుంతల అభి ప్రాయాన్ని మార్చా లనుకొన్నారు. కాని మీవల్ల కాలేదు. లేచిపోయామన్న వాదు రావడానికి మీరే కారణం! లేచి పోవాలని మాకు ఏనాడూ లేదు. కానీ, అంతకుతప్ప మరో మార్గమేమీ లేకుండా చేశారు. ఇందువల్ల మీరు సాధించిన దేమిటో మీకే తెలియాలి. కనీసం అప్పటి కయినా మీరు ఊరుకోవలసింది. పోలీసు రిపోర్టిచ్చారు. మేము మారు పేర్లు పెట్టుకోవలసి వచ్చింది. అందువల్లనే నా డిగ్రీ పనికిరాకుండా పోయింది. అందువల్లనే మేము ఆర్థికంగా బాధలు పడవలసి వచ్చింది. రెండు జీవితాలను ఇంతగా ధ్వంసం చెయ్యడానికి నైతం జంకని మీ మానవత్వాన్ని గురించి నాకు చాలా అను మానాలు కలుగుతున్నాయి. ఇన్ని చేసి మీరు పొందిందేమిటో నాకీనాటికీ బోధపడటం లేదు. నిలబడవలసిన గౌరవంగానీ, పరువు ప్రతిష్ఠలుగానీ నిలబడలేదు. బీదవాని కిచ్చాడన్న పేరు కన్నా, కూతురు లేచిపోయిం దనిపించుకోవడమే ఎక్కువ గౌరవమేమో మీకే తెలియాలి. మిమ్మల్ని గురించి నా అభి ప్రాయ మేమయినప్పటికీ, శకుంతల వంటి ఉత్తమురాలిని కన్నందుకూ, కని నాకు దక్కేలా చేసినందుకూ, మీమీద కొంత గౌరవం ఉంది. అందుకే ఈ జాబు రాస్తున్నాను. మీ నుండి నాకేసహాయమూ అక్కర్లేదు. కానీ శకుంతల మాత్రం

మిమ్మల్ని చూడాలని పదేపదే అంటోంది - ఆవిడ ఆరోగ్యం బొత్తిగా బాగాలేదు. మీరూ, మీఆవిడా ఒక్కసారి కనిపిస్తే సంతోషిస్తాను. మే మిద్దరమూ రావడానికి ఉన్న అభ్యంతరం మీకు తెలుసు; కాని మీరొస్తే తప్పకుండా స్వాగత మిస్తాను. మీ రెప్పుడొచ్చేదీ రాయండి. దిగువ చిరునామా ఇస్తున్నాను. మీరే వస్తారో, ఈ అడ్రసు పోలీసుల కిచ్చి నన్ను వేటాడు తారో తెలీదు. అయినా, అన్నిటికీ సిద్ధపడే ఈ జాబు రాస్తు న్నాను.....బహుశా శకుంతల అట్లేకాలం....

ఉంటాను,

శంకరం—"

సూర్యారావు 'ఎవరో చరిచినట్టు ఉలిక్కి పడ్డాడు. ఆ ఉత్తరాన్ని పదేపదే చదివాడు. చప్పున తన ఇంటి ప్రక్కనే ఉన్న కనకారావు జ్ఞాపకం వచ్చాడు. ఆయనగా రింటిపేరు కూడా 'కె.' అంటే ?

సూర్యారావు ఇంకేమీ ఆలోచించలేక పోయాడు. అతని తల నాదుగా ఉంది. చెవుల్లో చిన్న హోరు వంటిది బయలు దేరింది. ఆ నాదును భరించలేక కళ్లు మూసు కొన్నాడు. కనకారావు కుటుంబం, ఆయన కూతురు శకుంతల, భార్య రమణమ్మ, చిన్నపిల్లలు, అంతా బొమ్మల్లా కనిపిం చారు. అప్రయత్నంగా కళ్ళు నీటితో నిండిపోయాయి......

"ఏమిటోయ్ అది ?" అన్నా రెవరో.

ఏమిటో సూర్యారావు చెప్పలేదు గానీ, ఆ ఉత్తరా లన్నీ తగలెయ్యమని మాత్రం అన్నాడు..